# ఆర్టీసీ బస్టాండ్ కు చక్రాల కుర్చీ అందజేసిన నంద్యాల లయన్స్ క్లబ్

**వృద్ధులు,దివ్యాంగుల సౌకర్యార్థం చక్రాల కుర్చీ అందించాం: లయన్స్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ**

**లయన్స్ క్లబ్ కు ధన్యవాదాలు తెలిపిన ఆర్టీసీ డిఎం మాధవి లత**



**నంద్యాల,జులై04.అక్షర టైమ్స్:-** నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నంద్యాల ఆర్ టి సి బస్టాండ్ లో దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం చక్రాల కుర్చీ అందజేశారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవి లతకు వీల్ చైర్ ను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికుల సౌకర్యార్థం సహకారం అందిస్తామని అన్నారు. గత వారం రైల్వే స్టేషన్ కు రెండు చక్రాల కుర్చీలు అందజేశామని గుర్తు చేశారు.లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు మాట్లాడుతూ 2025- 26 సంవత్సరంలో దాదాపు 200 సేవా కార్యక్రమాలు నిర్వహించామని చివరి కార్యక్రమం గా దివ్యాంగులకు, వృద్ధులకు ఉపయోగపడే సేవా కార్యక్రమం చేయడం సంతోషాన్ని కలిగించింది అన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవి లత మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వీల్ చైర్ అందజేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ క్లబ్ సేవా దృక్పథాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ కిషోర్, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఉదయ భాస్కర్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డీ.కే. మూర్తి, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు సుబ్బరాజు, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సోమేశుల నాగరాజు, తాతి రెడ్డి భాస్కర్ రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్ధన్, జోనల్ చైర్మన్ నిజాముద్దీన్, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు ఎం.పీ.వి.రమణయ్య, నూతన అధ్యక్షులు గా ప్రమాణ స్వీకారం చేయనున్న సందీప్, సీనియర్ సభ్యులు యూసఫ్ పాల్గొన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# రాయలసీమ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా జగన్ కు సవాల్ విసిరిన : గుడిసె ఆది కృష్ణమ్మ





ఆదోని,జులై04.అక్షర టైమ్స్:- రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాయలసీమలో జరిగినటువంటి అభివృద్ధి గురించి అలాగే 2019 - 24 మధ్య జగన్మోహన్ రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని కర్నూలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆదికృష్ణమ్మ వైసీపీ అధినేత జగన్మోహనారెడ్డికి సవాల్ విసిరారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆకుపోగు ప్రభాకర్ కై పా పద్మలత రెడ్డి వై నాగేశ్వరరావు యాదవ్ మీన్నప్ప ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జనసేన,బిజెపి కూటమి ప్రభుత్వము అధికారంలోకి వచ్చి మొదలుకొని రెండు సంవత్సరాల కాలంలో రాయలసీమ అభివృద్ధి కోసం ఎంతో పాటుపడిందని రాయలసీమ జిల్లాలలోని ప్రతి జిల్లాకు కూడా ఏదో ఒక రకంగా పారిశ్రామికంగా అభివృద్ధి పరచాలన్న ఉద్దేశంతో చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అనుక్షణం పాటుపడుతున్నారని, ఇందులో భాగంగా నిన్నటి దినము కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లి గ్రామం నందు రాయలసీమ ఉక్కు ఫ్యాక్టరీకి పూజా కార్యక్రమాలు నిర్వహించడమైనది. రానున్న రెండు సంవత్సరాల కాలంలో ఈ ఫ్యాక్టరీలో ఉక్క తయారుకానుందని, ఇందులో వేలాదిమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని తెలియజేస్తూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రెండు పర్యాయాలు శంకుస్థాపనలు చేసి మూడు సంవత్సరాలలో పూర్తి చేస్తానని ఐదు సంవత్సరాల జగన్ పాలనలో కనీసం ఒక అంగుళం కూడా అభివృద్ధి చేయలేదని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పరిశ్రమము పట్టించుకున్న పాపాన పోలేదని గుర్తు చేశారు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు విడతల్లో ఈ ఫ్యాక్టరీని పూర్తి చేసేందుకు మొదటి విడతగా 4500 కోట్లు రెండవ విడతగా 11850 కోట్లు పెచ్చించి ఈ ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్లు తెలియజేశారు. పర్యావరణానికి అనుకూలంగా స్టీల్ ఫ్యాక్టరీ దక్షిణ భారతదేశంలోనే తక్కువ కార్బన్ ఉత్పాదకత కలిగిన సామర్థ్యంతో ఉత్పత్తి చేయడం జరుగుతుందని తెలిపార్. 2019 ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి రాయలసీమ ఉక్కు ఫ్యాక్టరీని పూర్తి చేస్తాను యువతకు ఉపాధి అవకాశాలు

కల్పిస్తానని గొప్పగా చెప్పారు కానీ చేసింది శూన్యం అదే చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారము ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం పనులను పూర్తి చేసేందుకు సిద్ధపడ్డారని తెలియజేశారు. రాయలసీమ అంటే కరువు కాటకాలకు నిలయంగా ఉన్నట్లు గమనించిన చంద్రబాబు నాయుడు రాయలసీమ అభివృద్ధికై సాగు తాగునీటి ప్రాజెక్టుల కోసం దాదాపుగా 120484 కోట్లు రక్షించారని 2026 27 బడ్జెట్లో పదివేల కోట్లు కేటాయించారని రాయలసీమ ప్రాంతంలోని

తుంగభద్ర గోరకల్లు శ్రీశైలం ఇతర సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులపై 610 కోట్లు కేటాయించడం జరిగిందని హంద్రీనీవా విస్తరణ కోసం 3873 కోట్లు ఖర్చు చేసి రాయలసీమ చివరి ఆయకట్టు భూములకు నిరంధించిన ఘనత చంద్రబాబు నాయుడు దేనని మాట తప్పము మడిమతిప్పను అని గొప్పగా చెప్పుకునే వైఎస్ఆర్సిపి వారు రాయలసీమ ప్రాంత అభివృద్ధికి చేసిందేమిటో వారు కనీసం రాయలసీమ ఉక్కు ఫ్యాక్టరీ కి ప్రహరీ గోడ కూడా నిర్మించలేకపోయారు అన్న విషయాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లాలోని పూర్వకలను పారిశ్రామిక హక్కుగా అలాగే అనంతపురం జిల్లాలో కియా మోటార్స్ పరిశ్రమను తిరుపతిలో రాయల్ ఎన్ఫీల్డ్ ను తీసుకొని వచ్చిన ఘనత వారిదని, త్వరలో కర్నూలు జిల్లాకు హైకోర్టు బెంచ్ రానున్నదని తెలియజేశారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి అరాచకాలకు తట్టుకోలేక రాయలసీమ ప్రాంతంలోని ఎన్నో పరిశ్రమలు పరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయాయని ఇందులో అమర్ రాజా వంటి పరిశ్రమలు ఉన్నాయన్న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో రెండు సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధిని చూసి మతిస్థిమితం కోల్పోయిన జగన్మోహన్ రెడ్డి ఏదో ఒకరకంగా ప్రజలలో కూటమి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయాలని రోజుకు ఒక మాట మాట్లాడుతున్నారు. తాను అధికారంలోకి వచ్చిన తక్షణమే అమరావతిలో నిర్మించబడినటువంటి ప్రజావేదికను కూల్చివేతతో తన దుష్ట పాలనను మొదలుపెట్టాడు అమరావతి రాజధానిని విస్మరించి రాజధానికి భూములు ఇచ్చిన రైతులను ఎన్నో ఇబ్బందులకు గురి చేయడమే కాక మూడు రాజధానులు అంటూ కొత్త నాటకానికి తెర తీశారు విశాఖపట్నం అమరావతి కర్నూలు రాజధానులు అంటూ తన సహజ నైజాన్ని బయట పెట్టుకున్నాడు తరువాత అమరావతి రాజధానికి కూటమి ప్రభుత్వము కట్టుబడి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడంతో దిక్కుతోచని జగన్మోహన్ రెడ్డి మరల మావిగన్ కొత్త నాటకం మొదలు పెట్టాడు. తర్వాత అమరావతి రాజధాని పరిరక్షణ పేరుతో అమరావతిపై తన రౌడీ మూకలను ఉసిగొలిపి దాడిలకు పాల్పడేందుకు కుట్రలు చేశాడు అది విడిసి కొట్టడంతో మరల విజయవాడ ఆంధ్ర రాజధాని అంటూ మరోమారు తన నైజత్వాన్ని బయట పెట్టుకున్నారు ఇలా ప్రతిసారి అమరావతి రాజధానిపై విషం చిమ్ముతున్న జగన్మోహన్ రెడ్డి ప్రస్తుతము కూటమి ప్రభుత్వం హయాంలో అమరావతి ప్రాంతంలో జరుగుతున్నటువంటి నిర్మాణపు పనులను చూసి ఓర్వలేక ఇలా మానసిక రుగ్మతతో రోజుకు ఒక రాజధాని పేరు చెబుతూ రాబోయే ఎన్నికలలో మావిగన్ రాజధాని అంటూ ఎన్నికలకు సిద్ధమవుతానని చెప్పారు మేము జగన్లా కాకుండా 2014లో అమరావతి రాజధాని అన్నాం 2019లో 2024లో అమరావతి కే కట్టుబడి నిర్మాణము పనులను కొనసాగిస్తున్నాము రానున్న 2029 ఎన్నికల్లో కూడా అమరావతి రాజధాని నినాదంతోనే ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని ఆంధ్రప్రదేశ్ కు ఏకైక రాజధాని అమరావతిని చంద్రబాబు నాయుడు తీసుకున్న దృశకల్పమని దానిని పార్టీ అన్నివేల సమర్థిస్తూ ముందుకు వెళతామని ఇందుకు రాష్ట్ర ప్రజల సంపూర్ణ సహకారం కూడా అవసరమని వారు విన్నవిస్తూ, వైసిపి నాయకులు కాలయాపన కోసం కబుర్లు చెప్పడం కాకుండా రాష్ట్ర ప్రజల కోసం ఏదైనా ఉపయోగపడే సలహాలు సూచనలు ఉంటే ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చౌకబారు కార్యక్రమాలు మాటలతో ఉన్న 11 సీట్లను కూడా పోగొట్టుకోకుండా కాపాడుకోవాలని సూచించారు.

# వైఎస్సార్ కడప జిల్లాకు రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీలో చోటు

**బి.మఠం మండలం, నాగిశెట్టిపల్లె గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్తకు రాష్ట్ర స్థాయి బాధ్యత**



**బ్రహ్మంగారిమఠం,జులై04.అక్షర టైమ్స్:-** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ఢ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీని పునర్నియమిస్తూ జి.ఓ.ఎం.ఎస్. నెం.8, తేదీ 30-06-2026ను జారీ చేసింది. ఈ కమిటీలో ఆహార భద్రత, ఆరోగ్యం, పోషకాహారం రంగాల్లో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థలు/సామాజిక కార్యకర్తల నుంచి అనధికార సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఇందులో వైఎస్సార్ కడప జిల్లా, బి. మఠం మండలం, నాగిశెట్టిపల్లె గ్రామానికి చెందిన శ్రీ టి. చైతన్య, గ్రామీణ రిఫార్మేటివ్ సొసైటీ ప్రతినిధిగా ప్రత్యేక వర్గం (ఎస్సీ) సభ్యునిగా రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీలో స్థానం పొందారు. ఈ కమిటీకి వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ఢ పౌర సరఫరాలు, లీగల్ మెట్రాలజీ శాఖ గౌరవ మంత్రి అధ్యక్షత వహించనుండగా, కమిటీ సభ్యుల పదవీకాలం మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజా పంపిణీ వ్యవస్థ, రేషన్ దుకాణాల పనితీరు, ఆహార భద్రత, వినియోగదారుల హక్కుల పరిరక్షణ, పోషకాహార పథకాల అమలు వంటి అంశాలపై పర్యవేక్షణ, ప్రభుత్వానికి సూచనలు అందించడంలో ఈ రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీ కీలక పాత్ర పోషించనుంది.

# నంద్యాలలో ఉస్మానియా ఇంగ్లీష్ మీడియం స్కూల్ 2వ బ్రాంచ్‌ను ప్రారంభించిన ఎన్.ఎండి ఫిరోజ్






**నంద్యాల,జులై04.అక్షర టైమ్స్:-** నంద్యాల పట్టణంలోని నడిగడ్డ (నబి నగర్) ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఉస్మానియా ఇంగ్లీష్ మీడియం స్కూల్ 2వ బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరై తన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ, గత ఏడు సంవత్సరాలుగా ఉస్మానియా స్కూల్ నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల విశ్వాసాన్ని సంపాదించిందని కొనియాడారు. ఆ విశ్వాసంతోనే నబి నగర్ ప్రాంతంలో రెండో బ్రాంచ్‌ను ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ పిల్లల ఉన్నత విద్య, ఉజ్వల భవిష్యత్తు కోసం అన్ని విధాలుగా ప్రోత్సహించాలని సూచించారు. అలాగే పాఠశాల యాజమాన్యం ఇదే నిబద్ధతతో నాణ్యమైన విద్యను అందిస్తూ మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.

# సిరివెళ్ల విద్యాసంస్థలు,అంగన్వాడి కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు

**పిల్లలకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా.?**

**స్వయంగా పరిశీలించిన రాష్ట్ర ఫుడ్ కమిషనర్ విజయ ప్రతాప్ రెడ్డి**






**సిరివెళ్ల,జులై04.అక్షర టైమ్స్:-** నంద్యాల జిల్లాలో పర్యటించిన ఫుడ్ కమిషనర్ చిత్త విజయ ప్రతాప్ రెడ్డి శనివారం సిరివెళ్ల మండల కేంద్రంలోని పలు విద్యాసంస్థలు,అంగన్వాడి కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ హై స్కూల్,కస్తూర్బా బాలికల విద్యాలయం (హాస్టల్), ప్రాథమిక ఉన్నంత పాఠశాల,ఏపీ మోడల్ స్కూల్,ఏపీ మోడల్ కాలేజ్‌తో పాటు పలు అంగన్వాడి కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు,చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్వయంగా వంటగదిలోకి వెళ్లి ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా కోడిగుడ్ల నాణ్యత,వంట పరిశుభ్రత,ఆహార నిల్వ విధానం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడిన చిత్త విజయ ప్రతాప్ రెడ్డి, "మీకు ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందుతున్నదా? కోడిగుడ్లు,ఇతర పోషకాహారం సక్రమంగా ఇస్తున్నారా?"అని అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల నుంచి వచ్చిన స్పందనను నమోదు చేసుకుని సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ప్రభుత్వం విద్యార్థులు,చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని,పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత సిబ్బందికి కమిషనర్ ఆదేశించారు. పిల్లల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొంటూ,ఇటువంటి ఆకస్మిక తనిఖీలు జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు,అంగన్వాడి కేంద్రాల్లో నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# ట్రిపుల్ ఐటీ రెండో విడత కౌన్సిలింగ్

**ఆర్జీయూకేటి రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్ర కుమార్**





**వేంపల్లె,జులై04.అక్షర టైమ్స్:-** ఆర్జీయూకేటి యూజీ-26 అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి ఆర్కేవ్యాలి, ఒంగోలు ట్రిపుల్ ఐటీల రెండో విడత కౌన్సిలింగ్ నిర్వహించినట్లు ఆర్జీయూకేటి రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్ర కుమార్ వెల్లడించారు. శనివారం ట్రిపుల్ ఐటీ సెంట్రల్ లైబ్రరీలో ఈ కౌన్సిలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఆర్కేవ్యాలి క్యాంపస్ మిగిలిన ఉన్న 8 సీట్లకు ఇద్దరు విద్యార్థులు హజరై అడ్మిషన్లు పొందారు. అలాగే ఒంగోలు క్యాంపస్ మిగిలిన ఉన్న 436 సీట్లకు, 320 మంది విద్యార్థులు హజరై అడ్మిషన్లు పొందారు. మిగిలిన సీట్లకు మూడో విడత కౌన్సిలింగ్ ప్రక్రియ త్వరలోనే ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విధ్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆచార్య అమరేంద్ర కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్కేవ్యాలి డైరెక్టర్ జి.విజయ్ ప్రకాష్, ఆయా క్యాంపస్ లో పరిపాలన అధికారులు డా. పి. రవికుమార్, ఎన్. చంద్రశేఖర్, అకాడమీక్ డీన్ రమేష్ కైలాస్, రూపస్ కుమార్, స్టూడెంట్ వెల్ఫేర్ డా. జీ. వెంకటేష్, అసోసియేట్ డీన్లు రాఘవరెడ్డి, నవీన్, ఉదయశ్రీ, హుస్సేన్, తిలక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. దీప్తి, అధికారులు బిన్నీ, ఓబయ్య, కోనప్ప, రాము, భాస్కరయ్య, పెద్దన్న, పిఆర్ఓ డా.తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్థితప్రజ్ఞుడు,రాజకీయ అజాతశత్రువు కొణిజేటి రోశయ్య

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా"తులసి రెడ్డి**



**వేంపల్లె,జులై04.అక్షర టైమ్స్:-** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య 93వ జయంతి, స్వామి వివేకానంద 124వ వర్ధంతి, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 129వ జయంతిని శనివారం వేంపల్లిలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి మాట్లాడుతూ రోశయ్య స్థితప్రజ్ఞుడు, రాజకీయ అజాతశత్రువని కొనియాడారు. 16 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన గొప్ప ఆర్థికవేత్తగా ఆయన సేవలను గుర్తు చేశారు. స్వామి వివేకానంద భారతీయ సనాతన ధర్మం, వేదాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడని, ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య సమరయోధుడిగా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మన్యం వీరుడని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తులసి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువకుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు, బద్రీనాథ్, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

**జనసేన పార్టీ యువ నాయకుడు రౌతు నాగేంద్ర**



**వేంపల్లె,జులై04.అక్షర టైమ్స్:-** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జనసేన పార్టీ మండల యువ నాయకుడు రౌతు నాగేంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని మల్లారెడ్డి స్ట్రీట్‌లోని బూత్ నంబర్ 233 వద్ద నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రౌతు నాగేంద్ర మాట్లాడుతూ, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ మేరీ తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థానంలో నాయిబ్రాహ్మణుల నియామకంలో జాప్యం తగదు

**ఈవోకు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు**





**వేంపల్లె,జూలై04.అక్షర టైమ్స్:-** స్థానిక పట్టణంలోని శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయాల్లో నాయిబ్రాహ్మణులు (భజంత్రీలు) నియామకంలో జాప్యం తగదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు శనివారం శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ, దేవస్థానానికి వంద కోట్ల రూపాయలకుపైగా విలువైన ఆస్తులు, ఏటా గణనీయమైన ఆదాయం ఉన్నప్పటికీ గతంలో తొలగించిన నాయిబ్రాహ్మణులను ఇప్పటికీ నియమించకపోవడం సరికాదన్నారు. గత ఆరు నెలలుగా నియామకాలు చేపట్టాలని కోరుతున్నా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. స్వామివారి నిత్య పూజా కైంకర్యాల్లో భజంత్రీలు తప్పనిసరిగా ఉండాల్సి ఉండగా, ప్రాకారోత్సవం రోజుల్లో మాత్రమే వారిని వినియోగించడం సమంజసం కాదన్నారు. దేవస్థానానికి చెందిన గదుల అద్దెల బకాయిల వసూళ్లు, ఆస్తుల పరిరక్షణ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హిందువుల మనోభావాలను గౌరవించి నాయిబ్రాహ్మణులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, రంగారెడ్డి, సురేష్, దశరథ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు విశ్వనాథరెడ్డి, చలమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ గురుకులం పార్ట్ టైమ్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని సీఎంకు వినతి

**పార్ట్ టైం ఉపాధ్యాయ సంఘాల నేతలు**



**బ్రహ్మంగారిమఠం,జూలై04.అక్షర టైమ్స్:-** రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కళాశాలలో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు లెక్చరర్స్ కు భద్రత కల్పించాలని ప్రభుత్వ పథకాలకు అర్హులను చేయాలని పెండింగ్ లో ఉన్న జీతాలను విడుదల చేయాలని తమ క్రమకు గుర్తింపు ఇవ్వాలని అంబేద్కర్ గురుకుల పాఠశాలల కళాశాలల యూనియన్ నాయకులు శనివారం నాడు కుప్పం పర్యటనలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి వినతి పత్రాన్ని సమర్పించారు ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఆదినారాయణ రెడ్డి ప్రవీణ్ మురగారెడ్డి గురు రత్నం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 1839 మంది పార్ట్ టైం ఉపాధ్యాయులుగా లెక్చరర్స్ గా పనిచేస్తున్నారని వారి కష్టాన్ని పనితనాన్ని గుర్తించి వేతన సవరణ చేయాలని అలాగే ప్రభుత్వ పథకాలు వర్తించేలాగా అమలుపరచాలని పెండింగ్ లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని వారు ముఖ్యమంత్రివర్యులు దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు ఈ విషయం పట్ల ముఖ్యమంత్రివర్యులు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించేలాగా చర్యలు చేపడతారని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ఆస్తమా ఉందాఅయితే ఈ చిట్కాలను పాటించండి ఉపశమనం లభిస్తుంది..!



చలికాలంలో లేదా ఇతర సమయాల్లో వాతావరణం చల్లగా ఉన్నప్పుడు చాలా మందికి శ్వాసకోశ సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా దగ్గు, జలుబు వంటి సమస్యల బారిన పడుతుంటారు. అయితే ఇవి సహజంగా వచ్చేవే. కానీ ఆస్తమా ఉన్న వారికి మాత్రం సీజన్లు మారినప్పుడు లేదా చల్లని వాతావరణం ఉన్నప్పుడు తీవ్రంగా ఇబ్బంది కలుగుతుంది. ఆస్తమాతో అల్లాడిపోతారు. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. అయితే ఆస్తమా ఉన్నవారు డాక్టర్ ఇచ్చిన మందులను క్రమం తప్పకుండా వాడాలి. అలాగే ఆహారం విషయంలోనూ అనేక జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. అయితే ఆస్తమా ఉన్నవారు పలు ఇంటి చిట్కాలను పాటించడం వల్ల సమస్య నుంచి ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. అలాగే శ్వాస నాళాలు క్లియర్‌గా మారుతాయి. ఊపిరి సరిగ్గా పీల్చుకోగలుగుతారు.

**పసుపు..**

ఆస్తమా ఉన్నవారికి పసుపు ఎంతో మేలు చేస్తుంది. పసుపులో కర్క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఆస్తమా నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. అందుకుగాను రోజూ రాత్రి పూట ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలలో కొద్దిగా పసుపును కలుపుకుని తాగాలి. ఇలా రోజూ చేయాలి. దీని వల్ల ఆస్తమా లక్షణాల నుంచి ఉపశమనం పొందవచ్చు. అలాగే ఆహారం విషయానికి వస్తే ఫ్లేవనాయిడ్స్, విటమిన్లు సి, డి, యాంటీ ఆక్సిడెంట్లు ఉండే ఆహారాలను తీసుకోవాలి. దీని వల్ల కూడా ఆస్తమా ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఈ ఆహారాల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల వీటిని తీసుకుంటే శ్వాస నాళాల వాపులు తగ్గిపోతాయి. దీని వల్ల శ్వాస నాళాలు క్లియర్‌గా మారి ఊపిరి సరిగ్గా తీసుకోగలుగుతారు. ఇందుకు గాను నారింజ, నిమ్మ, కివీ, ఆలుగడ్డలు, పాలు, చేపలు, గుడ్లు, లివర్, జున్ను, తృణ ధాన్యాలు, సిట్రస్ పండ్లను తీసుకోవాల్సి ఉంటుంది.

**అల్లం..**

ఆస్తమా ఉన్నవారు టీ, కాఫీలను తరచూ తాగుతుండాలి. చక్కెర లేకుండా బ్లాక్ టీ లేదా బ్లాక్ కాఫీ తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. వీటిల్లో అధికంగా ఉండే కెఫీన్ ఆస్తమా లక్షణాల నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. అలాగే శ్వాసనాళాలపై పడే ఒత్తిడి తగ్గిపోతుంది. దీంతో శ్వాస నాళాల వాపులు తగ్గిపోతాయి. అయితే కెఫీన్‌ను మరీ అధికంగా తీసుకోకూడదు. రోజుకు 3 లేదా కప్పుల టీ లేదా కాఫీ తాగాలి. అంతకు మించి తాగకూడదు. ఇక ఆస్తమాను తగ్గించుకునేందుకు అల్లం కూడా బాగానే పనిచేస్తుంది. ఇది గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫాన్ని తొలగిస్తుంది. శ్వాస నాళాలను వెడల్పుగా చేస్తుంది. దీని వల్ల శ్వాస సరిగ్గా లభిస్తుంది. ఆస్తమా నుంచి ఉపశమనం లభిస్తుంది. అల్లం రసాన్ని రోజూ రెండు పూటలా పూటకు ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

**యూకలిప్టస్ ఆయిల్..**

యూకలిప్టస్ ఆయిల్‌ను వాడుతున్నా కూడా ఆస్తమా లక్షణాలను తగ్గించుకోవచ్చు.

# 6.50 లక్షల రూపాయల తో వాటర్ ప్లాంట్ నిర్మాణం

**ఎమ్మెల్యే పుట్టాసుధాకర్ యాదవ్ చొరవతో నూతన మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి**

**నియోజకవర్గ అభివృద్ధికి మరో ముందడుగు..**



**బ్రహ్మంగారిమఠం,జూలై04.అక్షర టైమ్స్:-** మైదుకూరు నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చొరవతో నూతన మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీ వాంపల్లెచెరువు గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సూచనలతో కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి శనివారం ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తయితే ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందుబాటులోకి రావడంతో పాటు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఈ సందర్భంగా కానాల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యాలను మరింత మెరుగుపర్చేందుకు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్ యాదవ్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఎమ్మెల్యే చొరవను అభినందిస్తూ, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణంతో తమ ప్రాంతంలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మరియు మండల అభివృద్ధి అధికారి రామచంద్ర రెడ్డి, ఏపీఓ హరికృష్ణ, సెక్రటరీ శ్రీనివాసులరెడ్డి,మరియు , పార్టీ కార్యకర్తలు, పెరుగు నాగేంద్ర, పుటాలశివాయాదవ్, విజయచంద్ర,చంద్ర ఓబుళనాయుడు,ప్రభాకర్,నాగిపోగు మధు, నాగిపోగు సుధాకర్, కోడూరు సుధాకర్, నాగిపోగు ప్రసాద్, శాంతయ్య మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం మీ పార్థసారథి మరాఠీ గేరిలో పర్యటన

**ఇంటింటికి వెళ్లి సమస్యలపై ఆరా అధికారులకు తక్షణ చర్యల ఆదేశం**





**ఆదోని,జూలై04.అక్షర టైమ్స్:-** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న "ప్రజల కోసం... మీ పార్థసారథి" కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పార్థసారథి శనివారం ఉదయం పట్టణంలోని మరాఠీగేరిలో పర్యటించారు. మస్తాన్ వలి దర్గా నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ప్రధానంగా వర్షాకాలంలో ఇళ్లు తక్కువ ఎత్తులో ఉండటంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వంకపై ఉన్న కల్వర్టు వద్ద ప్రమాదాలు జరగకుండా రక్షణ కోసం ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అర్హులైన వారికి ప్రతి నెల పెన్షన్లు సకాలంలో అందుతున్నాయని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే "తల్లి కి వందనం" పథకం ద్వారా ఒకరు, ఇద్దరు, ముగ్గురు పిల్లలు చదువుతున్న కుటుంబాల్లో అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడం వల్ల పిల్లల చదువుకు ఎంతో తోడ్పాటుగా ఉందని తల్లులు హర్షం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వానికి, ప్రజల వద్దకే వచ్చి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి కి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి రవి, బీజేపీ నాయకులు రమేష్ నాయుడు, మాధవి, టీడీపీ మాజీ కౌన్సిలర్ తాయప్ప, నీలకంఠ, సీసీఐ వెంకటేష్, నాగప్ప, ప్రదీప్, స్థానిక మహిళలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

# సుంకాలతో వస్త్ర పరిశ్రమ కుదేలు!



డొనాల్డ్ ట్రంప్ సర్కార్ విధించిన సుంకాలు భారతీయ వస్త్ర పరిశ్రమ, ఎగుమతిదారులపై తీవ్రంగా పడింది. తమ ఆదాయం సగానికి పడిపోయినట్టు 34 శాతం వ్యాపార సంస్థలు నివేదించాయి. ఈ మేరకు కాన్ఫెడరేషన్‌ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (సీఐటీఐ) నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. భారత వస్త్ర ఎగుమతుల కు అతిపెద్ద మార్కెట్ అమెరికా. మన దేశ మొత్తం వస్త్ర ఎగుమతుల్లో అమెరికా వాటా 10.8 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం. భారత వస్త్ర ఎగుమతుల్లో ఇది సుమారు 30 శాతం. భారత ఎగుమతులపై ట్రంప్ సర్కార్ 25 శాతం అదనపు సుంకం, 25 శాతం జరిమానా, మొత్తంగా 50 శాతం సుంకం విధించింది. ఇది మన వస్త్ర ఎగుమతులను తీవ్రంగా దెబ్బతీసింది. సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో 60 అగ్ర వస్త్ర ఎగుమతిదారులు, పరిశ్రమల సంఘాలతో మాట్లాడి సీఐటీఐ ఈ నివేదికను విడుదల చేసింది. పోటీని తట్టుకుని నిలబడటానికి 25 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తున్నట్టు 67 శాతం ఎగుమతిదారులు తెలిపారు. ఈ క్రమంలో నష్టాలను భరించాల్సి వస్తున్నదని సీఐటీఐ సెక్రెటరీ జనరల్ చంద్రిమా ఛటర్జీ పేర్కొన్నారు. 'వస్త్ర పరిశ్రమ స్వల్ప మార్జిన్ కలిగిన వ్యాపారం. అయినప్పటికీ, వినియోగదారులను పోగొట్టుకోకుండా ఉండేందుకు చాలా కంపెనీలు డిస్కౌంట్లు ఇస్తూ నష్టాలను భరిస్తున్నాయి. అమెరికాతో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఏదైనా ఉపశమనం కలుగుతుందని వస్త్ర పరిశ్రమలు ఆశిస్తున్నాయి' అని ఛటర్జీ పేర్కొన్నారు. భారతదేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 2.3 శాతం వాటా కలిగిన, 4.5 కోట్ల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న వస్త్ర పరిశ్రమలు పెట్టుబడుల ప్రవాహం మందగించడం సహా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. దానికితోడు సుంకాల ప్రభావంతో అమ్మకాలు తగ్గిపోయి, ఆదాయాలు పడిపోయినట్టు భారతీయ వ్యాపారులు చెప్తున్నారు. అమెరికన్ల నుంచి డిస్కౌంట్ల కోసం అభ్యర్థనలు (30 శాతం), ఆర్డర్లను రద్దు చేయడం లేదా వాయిదా వేయడం (25 శాతం), ఆర్డర్ మొత్తంలో కోత (20 శాతం) తదితర కారణాల వల్ల ఆదాయాలు గణనీయంగా పడిపోయినట్టు పేర్కొంటున్నారు. ఆర్డర్ల మందగమనం కారణంగా గోదాంలలో స్టాక్ పేరుకుపోయి 85 శాతం కంటే ఎక్కువ మంది భారతీయ ఎగుమతిదారులు సతమతమవుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే 2025 సెప్టెంబర్‌లో వస్త్రాల ఎగుమతులు 10.34 శాతం తగ్గడం ఏ మాత్రం ఆశ్చర్యపరచలేదు. తత్ఫలితంగా చాలా మంది ఎగుమతిదారులు, ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈలు (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) తీవ్రమైన మూలధన వ్యయం కొరతను ఎదుర్కొంటున్నాయి. అంతేకాదు, మూలధన వ్యయం అవసరాలు 30 శాతానికి పైగా పెరిగినట్టు 40 శాతం మంది ఎగుమతిదారులు నివేదించారు. ఇది వస్త్ర రంగంలో పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడిని నొక్కిచెప్తున్నది.

భారతీయ వస్త్రాలపై అమెరికా సుంకాల ప్రభావం దేశవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తున్నది. ఎగుమతిదారులు, ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈలు ఆర్డర్ల రద్దుతోపాటు పోటీతత్వాన్ని తట్టుకునేందుకు భారీ డిస్కౌంట్లు ఇస్తున్నాయి. వియత్నాం, బంగ్లాదేశ్ వంటి తక్కువ సుంకం ఉన్న దేశాలతో పోటీపడుతున్నందున పెద్ద, చిన్న పరిశ్రమలు కూడా తీవ్ర ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నాయి. అంతా స్థిరపడిన తరుణంలో అకస్మాత్తుగా వచ్చిన మార్పు తమ వ్యాపారాలను నాశనం చేసిందని సూరత్‌కు చెందిన జేపీ కాచివాలా కంపెనీ డైరెక్టర్ ధర్మేష్ కాచివాలా ఆవేదన వ్యక్తం చేశారు. 'మేం పూర్తిగా అమెరికా మార్కెట్‌పై ఆధారపడ్డాం. యూఎస్ వినియోగదారులు కోరినట్టుగా అధిక నాణ్యతతో కూడిన వస్త్రాలను తయారు చేస్తాం. కాబట్టి, మా పెట్టుబడి ఎక్కువగా ఉంటుంది. సుంకాల నేపథ్యంలో దేశీయ మార్కెట్లపై దృష్టిసారించాలని ఇప్పుడు సలహా ఇస్తున్నారు. కానీ, పోటీ తీవ్రంగా ఉంది. అంతేకాదు, దేశీయ మార్కెట్ లాభదాయకం కాదు' అని ఆయన చెప్పారు. దేశంలోని వస్త్ర పరిశ్రమ కుదేలైంది. ఒక్క సూరత్‌లోనే ఉత్పత్తిలో 30-40 శాతం క్షీణత, రూ.7,200 కోట్లకు పైగా ఆదాయం కోల్పోయినట్టు అంచనా. ఈ నేపథ్యంలో కర్మాగారాలు పనిదినాలను తగ్గించుకుంటున్నాయి. డిమాండ్ పడిపోవడంతో వస్త్ర పరిశ్రమలు ప్రమాదంలో పడ్డాయి. పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉంది. కానీ, ఇది మూణ్నాలుగు నెలల్లో తగ్గిపోతుందని కాచివాలా అంచనా వేశారు. 'మేం ఇతర ఎగుమతి మార్కెట్లను అన్వేషిస్తున్నాం. కానీ, కొత్త మార్కెట్లలో పాగా వేసేందుకు కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. అమెరికాతో పోలిస్తే యూరోపియన్ మార్కెట్ల పరిమాణం చాలా తక్కువ. గత మూడు నెలలుగా మా పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు' అని ఆయన చెప్పారు. సుంకాల ప్రభావాన్ని అధిగమించడానికి ఎగుమతిదారులు గల్ఫ్, ఆగ్నేయాసియాలోనూ భారీ డిస్కౌంట్లను అందిస్తున్నారు. ప్రత్యామ్నాయ ఉత్పత్తి స్థావరాలను అన్వేషిస్తున్నారు. యూకేతో భారత్ చేసుకుంటున్న స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలతో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. అయితే, అమెరికా సుంకాల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రస్తుత రుణాల చెల్లింపుపై తాత్కాలికంగా వెసులుబాటు ఇవ్వాలని, మూలధన వ్యయం కోసం పూచీకత్తు లేని రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని వస్త్ర పరిశ్రమలు కోరుతున్నాయి. ముడి పదార్థాల దిగుమతులపై ఉన్న ఆంక్షలు, దిగుమతి సుంకాలను తొలగించాలని అభ్యర్థిస్తున్నాయి. అంతేకాదు, సిబిల్ స్కోర్‌ను ప్రభావితం చేయకుండా రుణాలపై వడ్డీ మినహాయింపులను ఆశిస్తున్నాయి. ప్రభుత్వం ఉపశమన ప్యాకేజీని

## జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా జరిగింది.. చైనాపై టారిఫ్‌లను తగ్గిస్తున్నా : ట్రంప్



అగ్రరాజ్యం అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరు దేశాల అధినేతలు భేటీ అయ్యారు. దక్షిణ కొరియా వేదికగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చైనాకు ట్రంప్ గుడ్‌న్యూస్ చెప్పారు. చైనాపై విధించిన టారిఫ్‌లను 10శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. బుసాన్‌లో దాదాపు రెండు గంటల పాటూ జరిగిన భేటీలో పలు అంశాలపై ఇరువురూ చర్చించారు. ఇక భేటీ అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. జిన్‌పింగ్‌తో సమావేశం అద్భుతంగా జరిగిందని తెలిపారు. అనేక అంశాలపై చర్చించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఇక ఈ భేటీలో సోయాబీన్ కొనుగోళ్లను తిరిగి ప్రారంభించడం, అరుదైన ఖనిజాల ఎగుమతికి సంబంధించిన సమస్యలు పరిష్కారమైనట్లు ట్రంప్ తెలిపారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్‌పై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. ఆయన ఓ గొప్ప నేత అని కొనియాడారు. ఆయనకు 10కి 12 మార్కులు ఇస్తానని ట్రంప్ వ్యాఖ్యానించారు.

# ఈ సీజన్‌లో ఎక్కువగా లభించే ఈ దుంపలను అసలు విడిచిపెట్టకండి ఎన్నో లాభాలు పొందవచ్చు..!



కూరగాయలు, ఆకుకూరలు సాధారణంగా మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. కానీ కొన్ని రకాల కూరగాయలు మాత్రం కొన్ని సీజన్లలోనే లభిస్తాయి. అలాంటి వాటిల్లో చిలగడదుంపలు కూడా ఒకటి. వీటినే కొన్ని ప్రాంతాల్లు కంద గడ్డలు అని కూడా పిలుస్తారు. ఇవి చలికాలంలో ఎక్కువగా మనకు అందుబాటులో ఉంటాయి. అయితే పేరుకు దుంపలే కానీ ఇతర దుంపల కన్నా ఇవి చాలా భిన్నంగా ఉంటాయని చెప్పవచ్చు. ఇతర దుంపలతో పోలిస్తే పోషకాల శాతం వీటిల్లో ఎక్కువగా ఉంటుంది. కనుక ఇతర దుంపల కన్నా ఇవి మనకు ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఈ సీజన్‌లో లభించే చిలగడదుంపలను తరచూ తింటుంటే అనేక పోషకాలు లభిస్తాయి. ఈ దుంపలను తినడం వల్ల మనం అనేక విధాలుగా లాభాలు పొందవచ్చు.

**కంటి చూపు మెరుగు పడేందుకు..**

చిలగడదుంపల్లో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతుంది. మన శరీరంలో ఇది విటమిన్ ఎ గా మార్పు చెందుతుంది. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్ కణాలు నాశనం అవుతాయి. క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు. విటమిన్ ఎ వల్ల కంటి ఆరోగ్యం మెరుగు పడుతుంది. కంటి చూపు పెరుగుతుంది. వయస్సు మీద పడడం వల్ల కళ్లలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. ఈ దుంపలను తినడం వల్ల శరీర భాగాల్లో వచ్చే మంటలను తగ్గించుకోవచ్చు. వీటిని తింటే విటమిన్ సి అధికంగా లభిస్తుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు వంటి సమస్యలు తగ్గిపోతాయి.